జాబ్‌మేలా పోస్టర్ కలెక్టర్ విడుదల

విశాలాంధ్ర -శ్రీకాకుళం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధ్వర్యంలో ఫిబ్రవరి 15 వ తేదీన ఎచ్చెర్ల నియోజకవర్గం లోని శ్రీ శివాని ఇంజనీరింగ్ కళాశాల, చిలకపాలెం నందు నిర్వహించ బడుతున్న మెగా జాబ్ మేళా పోస్టర్‌ను జిల్లా కలెక్టరు డా.మనజీర్ జీలాని సమూన్ చేతులమీదుగా స్పందన హాల్ నందు జెడ్పీ కార్యాలయం వద్ద మధ్యాహ్నం ఆవిష్కరించడం జరిగింది. అనంతరం మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళా లో సుమారు 13 స్థానిక మరియు బహుళజాతి ప్రైవేట్ సంస్థలు ఇంటర్వ్యూ లు నిర్వహిస్తారని ఈ సదవకాశాన్ని పదవతగతి నుంచి పి.జి వరకు ఏదయినా విద్యార్హత కలిగిన నిరుద్యోగ యువత సద్వినియోగ పరచుకోవాలని మరిన్ని వివరాలకొరకు 9550967353, 8317652552 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ.పి.ఎస్.ఎస్.డి.సి జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.బి సాయి శ్రీనివాస్, పిడి డీఆర్డిఏ, డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

జనసేన, టీడీపీ పొత్తుతోనే రాష్ట్రం అబివృద్ధి

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: జనసేన టిడిపి పొత్తుతోనే రాష్ట్ర అభివృద్ధి చెందుతుందని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి శాసనసభ్యులు కింజరావు అచ్చెన్నాయుడు అన్నారు. టెక్కలి నియోజక వర్గ జనసేన నాయకులు పల్లి కోటేశ్వరరావు జనసైనికులతో కలిసి సోమవారం అచ్చెన్నాయుడును నిమ్మాడ తన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ జనసేన, టిడిపి నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో తిరిగి వైకాపా అరాచకపాలన గూర్చి ప్రజలకు వివరించి వచ్చే ఎన్నికల్లో జనసేన, టీడీపీ పార్టీలకు ఓటు వేయాలని చెప్పాలని వారికి సూచించారు. అలాగే జిల్లా టిడిపి పార్టీ మాజీ అధ్యక్షుడు చౌదరి బాబ్జి నిమ్మాడలో అచ్చెన్నాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు. అలాగే నందిగాం మండలం నందిగాం, నౌగాం పంచాయతీ నుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలు, కోటబొమ్మాళి, విశ్వనాథపురం గ్రామాలను ంచి టిడిపి నాయకులు కార్యకర్తలు, సంతబొమ్మాళి మండలం నుంచి టిడిపి నాయకులు కార్యకర్తలు అచ్చెన్నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలు పై చర్చించారు. ఈ కార్యక్రమంలో నందిగాం మండల పార్టీ అధ్యక్షుడు పినకాన అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - రణస్థలం : అంబేద్కర్ సామాజిక భవన నిర్మాణ కమిటీ సమావేశం అధ్యక్షుడు దువ్వాన అప్పలసూరి మాస్టారు అధ్యక్షతన జరిగిన సమావేశంలో తేదీ 25 ఫిబ్రవరి 2024 ఆదివారం ఉదయం 10 గంటలకు కొండమొలగాం.. రెవెన్యూ పరిధిలో ముక్తం పురం గ్రామ కొండ ప్రాంతం దగ్గర అంబేద్కర్ సామాజిక భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం జరుగుతుంది. అదేవిధంగా ఆరోజు భారీ బహిరంగ సభ ఏర్పాటుకు సంఘ సభ్యులు అందరూ ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఉండే దళితులు, ఎస్సీలు, బడుగు బలహీన వర్గాలు, అంబేద్కర్ వాదులు, విద్యార్థులు, ఉద్యోగులు, కార్మిక, కర్షకులు, అందరూ హాజరై ఈ శంకుస్థాపన కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమానికి అందరూ హాజరై శంకుస్థాపన సభని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ,సింక అప్పారావు(సర్పంచ్) నేతల కృష్ణదండాశి జాన్, సింక సత్యప్రసాద్, నేతల సురేష్(ఎస్ఐ) యామల కృష్ణ, బొమ్మలాట శ్రీరామ్(సర్పంచ్) లింగాల ఈశ్వరరావు, బుడుమూరు ఎల్లారావు,తోట ఆదినారాయణ, బాలు, ప్రసాద్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఐటీడీఏ గిరిజన అభ్యర్థులతో ఉద్యోగాలు భర్తీ చేయాలి

విశాలాంధ్ర -పలాస : ఐటిడిఎలో గిరిజన అభ్యర్థులతో ఖాళీలు ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని గిరిజన జిల్లా జేఏసీ అధ్యక్షుడు సవర రాంబాబు డిమాండ్ చేశారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో బెంతు ఒరియాలు లేరని, ఎస్టీ జాబితాలో బెంతు ఒరియాలను చేర్చరాదన్నారు. జిల్లాలో గిరిజనులకు ఆమోద యోగ్యంగా నూతన ఐటిడిఎను ఏర్పాటు చేయాలని కోరారు. ట్రైకార్ రుణాలు మరలా గిరిజనులకు మంజూరు చేయాలని కోరారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత గిరిజన సబ్ ప్లాన్ నిధులు దుర్వినియోగం చేసిందని, ఆర్టికల్ 275(1) ప్రకారం గిరిజన నిధులు సబ్ ప్లాన్ నిధులు మరలా గిరిజనులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. బోయ, వాల్మీకి, మత్స్యకారులు ఏ ఇతర కులాల వారిని గిరిజన తెగల జాబితాలో చేర్చకూడదన్నారు. పలాస కేంద్రంగా ట్రైబల్ వెల్ఫేర్ ద్వారా గురుకుల బాలికల కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. నారా లోకేష్‌తో పాటు ఎంపీ రామ్మోహన్ నాయుడు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఉన్నారు.

పేదలకు అండగా వైయస్సార్ బీమా : ఎమ్మెల్సీ నర్తు రామారావు

విశాలాంధ్ర-కవిటి: పేదలకు అండగా వైయస్సార్ బీమా నిలుస్తోందని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని లండారిపుట్టుగ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మామిడి రాముడు కుటుంబాన్ని ఎమ్మెల్సీ నర్తు రామారావు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం మామిడి రాముడు భార్య గోపమ్మకు వైయస్సార్ భీమా తక్షణ సహాయం కింద పదివేల రూపాయలు రామారావు చేతుల మీదుగా అందజేశారు. మిగిలిన 90 వేల రూపాయల భీమా పరిహారాన్ని నామిని ఖాతాలో త్వరలో జమ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్స్, వైయస్సార్సీపి నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్పందన కార్యక్రమంలో 32 వినతులు

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక "స్పందన" కార్యక్రమంలో భాగంగా జిల్లా అదనపు ఎస్పీ డా.ప్రేమ కాజల్ నేరుగా ఫిర్యదు దారుల నుండి అర్జీలను స్వీకరించి, ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫిర్యాదు దారులు సమస్యలను అదనపు ఎస్పీ ముందు విన్నవించుకోగా, ఆమె సానుకూలంగా స్పందించి, సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని, బాధితులకు చట్ట పరిధిలో తక్షణ న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని తెలియజేశారు.

- విశాఖపట్నం రేంజ్ నూతన డీఐజీగా బాధ్యతలు స్వీకరించిన విశాల్ గున్నిని సోమవారం ఉదయం రేంజ్ కార్యాలయంలో శ్రీకాకుళం జిల్లా ఎస్పీ జి.ఆర్. రాధిక మర్యాదపూర్వకంగా కలసి పుష్ప గుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

16న పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్‌కు సన్నాహకంగా బైక్ ర్యాలీ

విశాలాంధ్ర-పలాస : రైతు, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కాశీబుగ్గ పెట్రోల్ బంక్ నుంచి పలాస ఇందిరా చౌక్ మీదుగా పలాస జూనియర్ కళాశాల వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో మోడి ప్రభుత్వం విధానాల వలన రైతులు, కార్మికులు, ప్రజల నానా అవస్థలు పడుతున్నారన్నారు. రైతులకు సాగునీరు అందించే చర్యలు చేపట్టడం లేదని, పండించిన పంటకు గిట్టుబాటు ధర నిర్ణయించి అమలు చేయడంలో పూర్తిగా ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు, గనులు, సహజ వనరులు సైతం కార్పొరేట్లుకు దారాదత్తం చేస్తున్నారని, కార్పొరేట్లుకు ఆటంకంగా ఉండకూడదని 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా మార్చేసి కార్మికులను కార్పొరేట్లుకు బానిసలుగా తయారు చేయాలని చూస్తున్నారని అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హెూదా, ఉత్తరాంధ్ర, రాయలసీమలకు ప్రత్యేక ప్యాకేజీలు ఇస్తామని హామీ ఇచ్చి ఏమి ఇవ్వకుండా మోసం చేశారని అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల 16న దేశవ్యాప్తంగా పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ బంద్‌కు ప్రజలందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరుతూ బైక్ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిఐటీయు జిల్లా కార్యదర్శి ఎస్.గణపతి, సిపిఐ ఎం.ఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు టి.సన్యాసిరావు, ఎఐసిసిటీయు నాయకులు డి.శ్రీనివాసరావు, ఐద్వా నాయకులు ఎస్.ఢిల్లేశ్వరి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డి.భాస్కరరావు, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనరు తెప్పల అజయ్‌కుమార్, జీడి కార్మికుల సంఘం నాయకులు వి.పాపారావు, భవననిర్మాణ సంఘం నాయకులు సింహాచలం, పి.నాగేశ్వరరావు, ఎఐఎస్ఎఫ్ నాయకులు రవి, ఎఐవైఎఫ్ నాయకులు వాసుదేవరావు, ఎఐకెఎంఎస్ నాయకులు వి.పాపయ్య, ఎఐకెఎం నాయకులు ఎం.రామారావు, పి.కామేశ్వరరావు, షన్ముఖరావు, తిరుపతి, కె.లోకనాథంలు పాల్గొన్నారు.

నారాయణపురం కొండ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు: పెద్ద బొడ్డపాడు పంచాయతీ పరిధిలోని నారాయణ పురం కొండను కొంతమంది ఆక్రమించుకున్నా రని, ఆక్రమణలు తొలగించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని పెద్దబొడ్డపాడు సర్పంచ్ తమ్మినాన ఢిల్లీరావు మండల సర్వసభ్య సమావేశంలో కోరారు. సోమవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సోషల్ ఫారెస్ట్ పరిధిలోని భూమిని ఆక్రమించుకొని తోటలు వేసుకున్నారని ఈ విషయమై గత మండల సమావేశంలో ప్రస్తావించడంతో పాటు తహసీల్దార్, రెవెన్యూ అధికారులకు అర్జీలు పెట్టినా స్పందన లేదన్నారు. అటవీశాఖ అధికారులు జోక్యం చేసుకొని భూ ఆక్రమణదారుల నుండి ఆ స్థలం విడుదల చేసి పేద ప్రజలు తోటలు పెంపకానికి అనువుగా కేటాయించాలని కోరారు. మండలంలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని, లోఓల్టేజి, స్తంభాలు మార్చడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని సర్పంచ్‌లు అట్టాడ గోపి, కర్ని శ్రీను, అంబటి రాజు, ఎంపీటీసి మాకయ్య అన్నారు. అక్కుపల్లి పాఠశాలలో నాడు-నేడు కింద పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదని, ఈ నెల 20వ తేదీలోగా పనులు ప్రారంభించకుంటే పాఠశాలకు తాళాలు వేస్తామని అక్కుపల్లి సర్పంచ్ ప్రతినిధి లండ రామలింగం హెచ్చరించారు. అన్ని చోట్లా నాడు-నేడు పనులు శరవేగంగా జరుగుతుంటే అక్కుపల్లిలో ఎందుకు జరగడం లేదని ప్రశ్నించారు. సీతాపురం అంగన్వాడీ కేంద్రానికి శాశ్వత భవనం లేదని ఐసిడిఎస్ వారు రూ.లక్షా 20 వేలు గ్రాంటు మంజూరు చేసారని, పాఠశాల వరండాలో గది నిర్మాణం కోసం అనుమతి కావాలని సర్పంచ్ తమ్మినాన ఢిల్లీరావు కోరారు. విద్యాశాఖ అధికారి డి. దాశరథి మాట్లాడుతూ పాఠశాలను పరిశీలించి ఉన్నతాధికారుల సూచనలు తీసుకుంటామని తెలిపారు. ఉద్దానంలో ఎలుగు బంట్లు సంచారంపై అటవీశాఖ అధికారులు శ్రద్ధ తీసుకోవాలని జోగ అప్పారావు, ఎంపీటీసి బమ్మిడి రాజేశ్వరి లు కోరారు. జడ్ పి వైస్ చైర్ పర్సన్ పాలిన శ్రావణి మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశాలకు అధికారులు డుమ్మా సరియైన పద్ధతి కాదన్నారు. దీనిపై మినిట్ తయారుచేసి ఉన్నతాధికారులకు పంపించాలని సూచించారు. మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ మాట్లా డుతూ అధికారులు, ప్రదాప్రతినిధులు సమన్వ యంగా ముందుకు వెళితేనే అభివృద్ధి జరుగుతుంది అన్నారు. ముఖ్యమైన మండల సమావేశాలకు అధికారులు గైర్హాజరు అయితే ప్రజాప్రతినిధులకు సమాధానం ఎవరు ఇస్తారని ప్రశ్నించారు. వచ్చే సమావేశాలకు అధికారులు గైర్హాజరు కాకుండా చూడాలని కోరారు. ఈసమావేశంలో వైస్ ఎంపీపీలు తమ్మినాన శ్రావణి, వంక రాజు, ఇన్ ఛార్జ్ ఎంపీడీవో డిక్కల తిరుమలరావు, డీటీ వాయిలపల్లి గిరిరాజ్, మండల విప్ తిర్రి గుణవతి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజలు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలి

- జగనన్నకు చెబుదాం స్పందన అర్జీలను సత్వరం పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జీలాని సమూన్

విశాలాంధ్ర -శ్రీకాకుళం : జగనన్నకు చెబుదాం స్పందన అర్జీల సత్వరం పరిష్కరించాలి జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జీలాని సమూన్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా రెవిన్యూ అధికారి ఎం గణపతి రావు, ప్రత్యేక ఉప కలెక్టర్ రామ్మోహన్ రావు, డిఆర్డిఎ, పి.డి విద్యాసాగర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి విజ్ఞప్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జీలాని సమూన్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి త్వరితగతిన పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కొన్ని వినతులు... హిరమండలం మండలం కోరాడ కాలనీకి చెందిన మగ్గ తిరుపతి రావు తండ్రి లెట్ లచ్చన్న తనకి సంబంధించిన భూ సేకరణకు సంబంధించిన పైకం తన వ్యక్తిగత ఖాతాలో జామచేయవలసినదిగా కోరుచూ స్పందన కార్యక్రమంలో దరఖాస్తును సమర్పించుకున్నారు. హిరమండలం మండలం కోరాడ కాలనీకి చెందిన సిరిపల్లి లీల, భర్త (లెట్) ధర్మారావు, నిర్వాసితుల కాలనిలో స్థలం మంజూరు చేయడం జరిగిందని ఇళ్లు నిర్మాణానికి రావలసిన పైకం పూర్తిగా అందలేదని తనకు పైకం ఇప్పించమని కోరుతూ దరఖాస్తు అందజేశారు.

హిరమండలం మండలం చిన్న కోరాడ గ్రామానికి చెందిన బొడ్డు తులసమ్మ, భర్త గడ్డయ్య తనకు సంబంధించిన ఇంటి స్థలం కబ్జాకు గురైందని తనకు సంబంధించిన స్థలాన్ని ఇప్పించమని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కార్యక్రమంలో ఏపీయుడబ్ల్యుజె సంఘ నాయకులు జిల్లా కలెక్టర్‌కి డైరీ అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలుచేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, నవరత్నాలు- పేదలందరికీ ఇళ్ల పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు, భూవివాదాలు తదితరాలకు సంబంధించి 220 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ కు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ నిర్దేశిత సమయంలోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈస్పందన కార్యక్రమంలో కెఆర్‌సి ప్రత్యేక ఉపకలెక్టర్ దొరబాబు, జెడ్పి సిఇఓ. డి.వెంకటేశ్వర రావు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి బి మీనాక్షి ద్వామా పి.డి చిట్టి రాజు, డిసిహెచ్ఎస్ డా.రాజ్యలక్ష్మి, హౌసింగ్ పి.డి గణపతిరావు, ఇరిగేషన్ ఎస్ఇ డోల తిరుమలరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రూ.12.50 కోట్లతో 14 గ్రామాల్లో అభివృద్ధి పనులు

మాజీ మంత్రి, ధర్మాన ప్రారంభోత్సవం

విశాలాంధ్ర-నరసన్నపేట: మండలంలో 14గ్రామాల్లో సుమారు రూ. 12.50కోట్లతో నిర్మించిన రహదారులు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఇంటింటికి కొళాయిలు, విలేజ్ క్లినిక్‌లు నిర్మాణాలను వైసిపి జిల్లా అధ్యక్షులు, ధర్మాన కృష్ణదాస్, పోలాకి జెడ్పీటిసి, డా.ధర్మాన కృష్ణచైతన్య సోమవారం ప్రారంభోత్సవం చేశారు. కంబకాయలో రూ.20.80లక్షలతో నిర్మాణం చేపట్టిన వైఎస్ఆర్ హెల్త్‌క్లినిక్ సెంటర్ ప్రారం భించారు. అలాగే ఉర్లాంలో రూ.25లక్షలతో నిర్మించిన సచివాలయం భవనం ప్రారంభించారు. జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.78లక్షలతో ఇంటింటికి కొళాయిలు శంఖుస్థాపన చేశారు. చిక్కాలవలస గ్రామంలో రూ.25లక్షలతో సచివాలయ భవనం, మామిడి వలసలో ఇంటింటికి కొళాయి రూ.23.50 లక్షలతో ప్రారంభించారు. నడగాంలో రూ.21.50 లక్షలతో సచివాలయం ప్రారంభం, రూ.98.10 లక్షలతో కొళాయి ప్రారంభించారు. రూ.24.59 లక్షలతో శివరాంపురంలో ఇంటింటికి కొళాయి ప్రారంభించారు. కామేశ్వరిపేటలో రూ.21.80 లక్షలతో నిర్మించిన వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ ప్రారంభించారు. లుకులాంలో రూ.60.40 లక్షలతో కొళాయిలు ప్రారంభించారు. అలాగే జెడ్పీహెచ్ పాఠశాలలో నాడు-నేడు పనులు రూ.1.86కోట్లతో శంఖుస్థాపన చేశారు. రూ.21.80లక్షలతో ఆర్‌బికేను ప్రారంభించారు. మడపాంలో కొత్తపేటలో కొళాయిలు రూ.40.50లక్షలతో ప్రారంభించారు. మడపాంలో రూ. 60.70లక్షలతో కొళాయిలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రానికి చిన్నారుల సాయం

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట సమీపంలో గల సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొత్తగా నిర్మిస్తున్న దివ్యాంగుల పునరావాస కేంద్ర నిర్మాణానికి సోంపేటకు చెందిన జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల చిన్నారులు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. సోమవారం చిన్నారి బాలికలు విరాళాలుగా సేకరించిన 11,116 రూపాయలను సీతయ్య ఫౌండేషన్ నిర్వాహకులు గుల్ల రమేష్, మోహన్‌లకు అందజేశారు. ఉపాధ్యాయులతో కలిసి వెళ్లి ఈ సహాయాన్ని అందించడం పట్ల నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు.

క్రైమ్ అడిషనల్ ఎస్పీగా ఉమామహేశ్వరరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా శ్రీకాకుళం జిల్లా పోలీసు అదనపు ఎస్పీ(క్రైమ్స్) గా బదిలీపై వచ్చిన బి. ఉమామహేశ్వర రావు సోమవారం ఉదయం జిల్లా పోలీసు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఏలూరు జిల్లా నుంచీ శ్రీకాకుళం క్రైమ్ అడ్షినల్ ఎస్పీగా బదిలీపై వచ్చారు.

డిజిపురం పిహెచ్‌సి సేవలు భేష్

డిప్యూటీ డిఎంహెచ్‌ఓ, డాక్టర్ ప్రసాద్

విశాలాంధ్ర -సంతబొమ్మాళి : దండుగోపాలపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, సిబ్బంది సేవలు భేష్ అని, డెప్యూటీ డిఎంహెచ్‌ఓ డాక్టర్, డి. ప్రసాదరావు అన్నారు. సోమవారము ఆయన పిహెచ్‌సిని ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వివిధ రకాలు రోగులకు ఉచితంగా అందించిన మందులు వివరాలు రికార్డులును పరిశీలించారు, పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సుధీర్, వైద్య సిబ్బంది పాల్గన్నారు.

పిఎంజెజెబివై బీమా చెక్కు అందజేత

విశాలాంధ్ర-మందస : మండలం అంబుగాం గ్రామం శివానీ డ్వాక్రా సంఘానికి చెందిన తిరుమ గిరి షన్ముఖ ప్రియ చనిపోయారు. ఈమె హరిపురం ఎపిజివిబి బ్రాంచ్‌లో ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి (పిఎంజెజెబివై) పథకం చేరడంతో ఈ పథకం ఆమె నామిని టి.చంద్రమోహనరావు హరిపురం ఎపిజీవిబి బ్రాంచ్ మేనేజర్ ఎం.విజయ్‌తేజ, సెర్ప్ ఎపిఎం గొడబ ప్రసాదరావులు 2 లక్షల రూపాయల బీమా చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు పిఎంజెజెబివైలో చేరడం వలన ఈ పథకం వర్తించిందని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది బాలక్రిష్ణ పాల్గొన్నారు.

అన్నిరకాల ఎరువులు వేసుకోవాలి

విశాలాంధ్ర-జలుమూరు: రబీ వరి పంటకు 60 రోజులలోగా అన్నిరకాల ఎరువులు వేసుకోవాలని జలుమూరు మండల వ్యవసాయ అధికారి కె. సురేష్ కుమార్ ఒక ప్రకటనలో సూచించారు. ఖరీఫ్లో వరికి ఎరువులు వేసిన కాలమానం రబీ వరి పంటకు పాటించకూడదని చెప్పారు. నాట్లు వేసిన నాలుగు, ఐదు రోజుల్లో పీకపురుగు రాకుండా గుళికలు తప్పనిసరిగా వేయాలన్నారు. తెగుళ్లపట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

తేదేపా పార్టీలో చేరిన వైకాపా నాయకులు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : సంతబొమ్మాళి మండలం లింగూడు పంచాయతీ కి చెందిన పలువురు వైకాపా నాయకులు, రాష్ట్ర తెదేపా అధ్యక్షులు, టెక్కలి శాసనసభ్యులు కింజరావు అచ్చెన్నాయుడు సమక్షంలో సోమవారము తెలుగుదేశం పార్టీలో చేరారు. మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు జీరు భీమారావు, మాజి పిఎసియస్ అధ్యక్షుడు అట్టాడ రాంప్రసాద్‌రావు సారథ్యంలో ఆపంచాయితీకి చెందిన బొంగు అప్పారావు, గిన్ని సత్యం, పరపటి దానయ్య, జీరు కృష్ణరావు, మోస గురుమూర్తి, గిన్ని శ్రీరాములు, మోస శ్రీరాములుతోపాటు పలువురు పార్టీలో చేరారు. పార్టీలోకి చేరినవారికి అచ్చెన్నాయుడు తెలుగుదేశం కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

మత్యకారుల సమస్యలపై లోకేష్ బాబుకు వినతి

విశాలాంధ్ర- సంతబొమ్మాళి... జిల్లాలో కల మత్స్యకారులు ఎదుర్కుంటున్న సమస్యలపై కేంద్ర తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబుకు సోమవారము మత్యకార సంఘాల నాయకులు వినతిపత్రం సమర్పించారు. మత్యకారులకు రాజకీయ ప్రాధాన్యత, సబ్సిడీ పదకాలు తదితర అంశాలపై లోకేష్ బాబు ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు మత్స్యకార సహకార సంఘ నాయకులు తెలిపారు. బాబుకు వినతి పత్రం సమర్పించిన వారిలో జిల్లా మాజీ మత్యకార సంఘము అధ్యక్షుడు అధ్యక్షుడు నర్సింగరావు, జిల్లా మత్స్యకార నాయకులు వారాదీ చంటి, సూరాడ దనరాజు, సూరాడ భీమారావు, అర్జ దానేసు, కోటేశ్వరరావు తో పాటు పలువురు మత్యకార సంఘము నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి ఆహారంతోనే ఆరోగ్యం

విశాలాంధ్ర-సోంపేట : ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆహార పంటలతో మంచి ఆరోగ్యం లభిస్తుందని ఈ మండలం పలాసపురం సేంద్రీయ వ్యవసాయ యూనిట్ సభ్యులు పేర్కొన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో సోమవారం పలాసపురం యూనిట్ ఆధ్వర్యంలో ఎటిఎం పద్ధతిలో సాగు చేసిన సేంద్రీయ కూరగాయలను విక్రయించారు. ఈ సందర్భంగా అనేక మంది కొనుగోలుదారులు కూరగాయల కొనుగోలుకు ఆసక్తి చూపారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, వ్యవసాయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని శాఖలు సమన్వయంతో వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకూడదు
- జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సమూన్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి రథసప్తమి వేడుకలకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్ పేర్కొన్నారు. ఫిబ్రవరి 16న జరుగనున్న రథసప్తమి వేడుకల ఏర్పాటులో భాగంగా సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. దర్శనం కోసం వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండ చేపట్టనున్న ఏర్పాట్ల పై సమావేశంలో తొలుత జిల్లా కలెక్టర్ కు ఆలయ ఈవో డి.ఎల్.వి.రమేష్ వివరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అరసవిల్లి రథసప్తమి వేడుకలు నిర్వహించాలని చెప్పారు. క్యూలైన్లు, ప్రసాదాల పంపిణీ తదితర చర్యలు చేపట్టాలని, పాలు, బిస్కెట్లు, మంచినీరు అందించే ప్రక్రియ సజావుగా జరపాలని చెప్పారు. వైద్య శిబిరాల ఏర్పాటు, ఉచిత భోజనం వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఫిబ్రవరి 15వ తేదీ అర్ధరాత్రి నుండి పూజా కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయని, ప్రశాంత వాతావరణంలో వేడుకలు నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయని పేర్కొన్నారు. రథసప్తమి దృష్ట్యా దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. నిరంతరం విద్యుత్ అందేలా చర్యలు చేపట్టాలని అలాగే ముందస్తు జనరేటర్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని, భక్తులకు నిరంతరం అందుబాటులో త్రాగు నీరు అందించే చర్యలు చేపట్టాలని, వికలాంగులు, వృద్ధుల కోసం వీల్ చైర్స్ ఏర్పాటుచేసి అవి ఎక్కడ అందుబాటులో ఉన్నాయో తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. నిరంతరం సీసీ కెమెరాలు పని చేసేలా చూడాలని, కమాండ్ కంట్రోల్ రూమ్ లో రెవిన్యూ, దేవాదాయశాఖకు సంబంధించిన సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. 80ఫిట్ రోడ్లో భక్తుల వాహనాల పార్కింగ్ కి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో విధులు నిర్వహించి రథసప్తమి వేడుకలు పండగ వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చూడాలని, పుష్కరిణి పరిసరాల్లో లైటింగ్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ జి .ఆర్.రాధిక, కార్పొరేషన్ కమీషనర్ తమీమ్ అన్సారియ, జిల్లా అటవీ శాఖాధికారిణి నిషాకుమారి, డిఆర్ఓ గణపతి రావు, ఆర్.డి.ఓ, సి.హెచ్ రంగయ్య, ఎండోమెంట్ ఆర్జెసి విజయకుమార్, సహాయ కమిషనర్ డి.వి.వి.ప్రసాద్ పట్నాయక్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి బి మీనాక్షి, ట్రాఫిక్ సి.ఐ అవతారం, పంచాయతీ, మత్స్య శాఖ, అగ్నిమాపక శాఖ అధికారులు సిబ్బంది, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయం, నరసన్నపేట

రేఖా.నెం. 32/2024-బి   తే:12-02-2024ది

టెండర్ ప్రకటన

శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం, నరసన్నపేట గ్రామ పంచాయతి నందుదిగువ సుదహరించిన షెడ్యులు-1 చూపబడిన సామగ్రి 2024-2025 (తే. 01-04-2024ది నుండి తే. 31-03-2025ది వరకు) కాంట్రాక్టు పద్ధతిపై పనులు చేయుటకు టెండర్ దాఖలు చేయువారు టెండర్ దరావత్తు చెల్లించి తే. 17-02-2024ది ఉదయం గం.11-00 నుండి మధ్యాహ్నం గం.1-00 వరకు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద యీ దిగువ సంతకం దారునిచే గాని లేదా వారి అనుమతి పొందిన ఇతర ఉద్యోగిచే గాని సీలు వేసిన టెండర్లు స్వీకరించబడును. స్వీకరించబడిన టెండర్లు అదేరోజు మధ్యాహ్నం గం.3-00లకు అప్పటికే హాజరైన టెండరుదారుల సమక్షంలో తెరవబడును. టెండరుదారులు టెండర్ షరతులకు లోబడి పాల్గొనవలెను.

షెడ్యులు-1 (టెండరు)

వ.నెం.	పని/సరఫరా సామగ్రి వివరములు	పోస్టుల సంఖ్య	చెల్లించవలసిన ధరావత్తు
1)	PWS గ్యాంగ్ మజ్దూర్లు-2	01	రూ.500/-
2)	PWS పంప్ హౌస్ వాచ్‌మెన్-4	01	రూ.500/-
3)	సత్యవరం గ్రామం జల్ జీవన మిషన్ పథకము దేవాది వద్ద గల PWS స్కీం పంప్ హౌస్ ఆపరేటర్ పనులు	01	రూ.500/-

షరతులు : G.O MS.No.57 PR&RD (Esst.III) Department. Dated : 13-02-2019 నిబంధనలకు లోబడి గరిష్ట వేతనము రూ.10,000/-లకు మించకుండా టెండర్ దాఖలు చేయవలెను మరియు గత సంవత్సరములో పనిచేయు సిబ్బంది గరిష్ట వేతనముకంటే మించి కాంట్రాక్టు వేతనము ఉన్నట్లయిన సదరు మొత్తమునకు మించకుండా టెండరు దాఖలు చేయవలెను మరియు గ్రామ పంచాయతీలో ఇదివరలో పనిచేసిన అనుభవం కలిగినవారికి మొదటి ప్రాధాన్యత కల్పించబడును.

టెండర్లు ఎట్టి కారణము చూపి గాని, చూపకుండా గాని, వాయిదా వేయుట గాని, తిరస్కరించుట గాని, పూర్తి అధికారి యీ గ్రామ పంచాయతీకి, అందులకు సంబంధించిన అధికారులదై యుండును. పూర్తి షరతులు, ఇతర వివరములు కార్యాలయ పని వేళలయందు అడిగి తెలుసుకోవలెను.

సం.//-సవర చిన్నారావు
కార్యనిర్వహణాధికారి (పంచాయతీ కార్యదర్శి)
గ్రామ పంచాయతీ, నరసన్నపేట

కన్ను పడితే చాలు కబ్జా చేయాల్సిందే...!

- బినామీ పేరున రెండు కొండలు స్వాహా...
- అసైన్మెంట్ కమిటీ ఎక్కడ
- మామూళ్ల మత్తులో అధికారులు

విశాలాంధ్ర-ఆమదాలవలస: కన్ను పడితే చాలు ఎంత ఖర్చయినా సరే సొంతం చేసుకోవాల్సిందే. అది కొండైన వాగైనా వంకైనా తమ సొంతం కావాల్సిందే. మున్సిపాలిటీ పరిధిలోని రెండు ఎర్ర కొండలు మధ్యలో తాటి కర్ర చెరువు తమ వశం చేసుకునేందుకు కొందరు పావులు కదిపారు. ఎనిమిది నెలల తరువాత వారి ఆశలకు రూపం దక్కింది. వీటన్నింటికీ సూత్రధారులు వెనుక ఉండి కార్యము నడిపించినట్లు విమర్శలు ఉన్నాయి. అధికారులు వారికి అందిన తైలం బరువుతో ఆక్రమణదారుల ఫైలుపై సంతకాలను కూడా చేయడానికి సిద్ధపడినట్లు తెలిసింది. కొండైన బండైన చివరకు వాగులు వంకలు ఆక్రమణకు కాదేది అన్నట్టు కబ్జాదారులు దురాక్రమణలు చేస్తున్నారు. నేతల కనుసన్నలలో స్కెచ్ వేసి ప్రభుత్వ భూములను కొట్టేస్తున్నారు అన్న విమర్శలకు కొన్ని నిజాలు ఉదాహరణలుగా మారుతున్నాయి. రెవెన్యూ అధికారుల మాయాజాలంతో కొండలు సైతం ఆక్రమణదారుల చేతులలో పిండి అవుతున్నాయి. పట్టణం లోని జగ్గు శాస్త్రాలుపేట, తాళ్లవలస, తిమ్మాపురం ప్రాంతాలలో ఉన్న ఎర్ర మట్టి కొండలు బినామీల చేతుల్లోకి వెళ్ళిపోతున్నాయి. మత్తులో అధికారులు జోగుతున్నట్లు ఈ వ్యవహారం తెలిసిన వారు ఆరోపిస్తున్నారు. గత ఏడాది జూన్ నెలలో ఇంటింటికి మంచినీటి కొళాయి ఏర్పాటు తాళ్లవలసలో చేశారు. ఆసమయంలో నేతల వెనుక ఉన్న బినామీలు ఆప్రాంతాలను పరిశీలించారు. అప్పటి నుండి కొండపై కన్నేసి వసుపరు చుకున్నట్లు తెలుస్తోంది. తాళ్లవలసజగ్గు శాస్త్రులపేట పరిధిలోని ఫీల్డ్ నెంబర్ 34లో నాలుగు ఎకరాల రెండు సెంట్లు కొండ ప్రాంతం వుంది. అలాగే తిమ్మా పురం ర్యాంపు ఆనుకొని ఫీల్డ్ నెంబర్ 20లో రెండు ఎకరాల 38 సెంట్లు ఎర్ర కొండ ఉంది. ఈ రెండింటికి మధ్యన తాటి కర్ర చెరువు ఉంది. ఈ మొత్తం పై కన్నేసిన పొందూరు మండలానికి చెందిన వ్యక్తి తన అనుచరుని పేరు మీద ఆ ప్రాంతాన్ని స్వాహా చేసేందుకు పావులు కదిపారు. అధికార పార్టీ నాయకు డిగా చెప్పుకునే వ్యక్తి కావడంతో రెవిన్యూ అధికారులు కూడా తలవంచి నట్లు తెలి సింది. మొదట కొంత బెట్టు చేసినప్పటికీ ఆ అధికారిని బదిలీ అయిన తర్వాత మళ్లీ ఫైలు పుటప్ చేశారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ కొంత మంది అధికారులను బదిలీలు చేశారు. ముందుగా ఫైలు పూర్తయిన తర్వాతే రిలీవింగ్

అందుతుందని కొంతమంది బినామీలు బెదిరించడంతో తలొగ్గినట్లు తెలిసింది. ఇదే సమయంలో అందనికాలకు తిరువూరు దిగువ స్థాయి అధికారులు ద్వారా వసూళ్ల పర్వం పూర్తి చేసినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

అసైన్మెంట్ కమిటీ ఎక్కడ... ప్రభుత్వ భూములను ఇవ్వాలన్న, పేదలకు పట్టాలు ఇవ్వాలన్న, ఇంకే ఇతర అవసరాలకు అందించాలన్న అసైన్మెంట్ కమిటీ తీర్మానం ఉండాలి. వైసిపి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత పట్టణంలోని ప్రభుత్వ భూములు చెరువులు, బండలు, అక్రమునకు గురికాకుండా నియంత్రించేందుకు కమిటీని వేశారు. ఈ కమిటీలో మున్సిపల్ కమిషనర్ చైర్మన్ గాను ఎమ్మార్వో, పోలీస్ అధికారులు తో కమిటీ ఏర్పడింది. రెవిన్యూ శాఖలో మాత్రం ఇప్పటివరకు అటువంటి కమిటీలు లేవు. అంతేకాకుండా గతంలో మాదిరి ఫుడ్ కమిటీ కూడా లేదు. వీటన్నింటినీ సచివాల యం, వాలంటరీ వ్యవస్థ ద్వారా కార్యకలా పాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలు పుతున్నారు.

తాటి కర్ర చెరువు ఏమైనట్లు... రెండు ఎర్ర కొండలు ఉండడం తాటికర చెరువు పురపాలక సంఘ పరిధిలో ఉండేది. ఉపాధి హామీ పనులు వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మొదలు పెట్టారు. కేవలం గ్రామీణ ప్రాంతాలకే ఆ పథకాన్ని వర్తింపచేసింది కేంద్ర ప్రభుత్వం. అయితే ఆ ప్రాంతంలో ఉన్న బొబ్బిలి పేట రైతుల కు సాగునీరు అందించేందుకు వీలుగా ఆ చెరువును కూడికలు తీసి రైతులు అందించే క్రమంలో అది హామీ కూలీలతో పనులు చేయించారు. అప్పట్లో అక్కడ రెవెన్యూ రికార్డులు మార్పుకు బీజం పడింది. ఆ క్రిందిన ఉన్న సాగు భూములకు నిరంధించే తాటి కర్ర చెరువు గ్రామీణ ప్రాంతాల పరమైంది. అప్పటి జీవోలను వెలికి తీసి ఇప్పుడు బినామీ పేరున ఆ కొండలను ధకల పరిచినట్లు తెలుస్తుంది. ఏది ఏమైనప్పటికీ ఇక్కడ ఎర్రకార చెరువు రూపురేఖలు పూర్తిగా మారిపోయాయనే చెప్పాలి. రెవెన్యూ అధికారులు వారు చేసిన తప్పులకు అనుకూలంగా వీటన్నింటినీ రికార్డులలో మార్పు చేసుకున్నట్లు దిగువ స్థాయి సిబ్బంది రుసరుసులాడుతున్నారు. ఈ మొత్తం వ్యవహారం నడిపించడంలో ఇద్దరు అధికారులు ఓ అధికార పార్టీ కార్యకర్త చక్రం తిప్పినట్లు తెలుస్తోంది. ఈ అధికారుల చేతుల మీదుగానే లక్ష రూపాయలు చేతులు మారాయి అన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

బినామీల పేరున రెండు కొండలు... ఓ బినామీ పేరున ఆరు ఎకరాల 40 సెంట్లు విస్తీర్ణం కల రెండు కొండలను అందించేందు కు అధికారులు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి రెవెన్యూ మాయాజాలంతో ఎక్స్ సర్వీస్ మెన్ పేరున వీటిని బదలాయించినట్లు వినవొస్తుంది. ప్రభుత్వ భూమిని ఇతరులకు అందించే క్రమంలో నిబంధనలు పాటించాల్సి ఉంది. అటువంటి కమిటీలు రెవెన్యూ పరిధిలో అధికారికంగా కనిపించడం లేదు. అధికార పార్టీ కార్యకర్త చక్రం తిప్పడంతో ఇద్దరు అధికారులు మాయాజాలం తో రెండు కొండలతో పాటు తాటి కర్ర చెరువు కూడా అక్రమార్కుల చెరలో పడినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. బొబ్బిలి పేట, తిమ్మాపురం సాగు భూములకు నీరు అందించే వాగులను చెరువులను దురాక్రమకు గురైతే ఉన్నతా ధికారులకు ఫిర్యాదు చేస్తామని ఆ ప్రాంత రైతులు ముక్తకంఠంతో అంటున్నారు. ప్రభుత్వ భూములను అప్పనంగా ఇత రులకు కట్టు పెట్టడంలో ఈ ఎంతటి అధికారి హస్తం ఉన్న ఉన్నతాధికారుల చర్యలు చేపట్టవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వాన్ని తదితరులు చర్యలు చేపట్టి ప్రభుత్వ ఆస్తులను కాపాడవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయమై తాసిల్దార్ కే వేణుగోపాల రావును వివరణ కోరగా తాను ఇటీవల ఛార్జ్ తీసుకున్నానని పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటానని తెలిపారు.

చంద్రబాబును, లోకేష్‌ను విమర్శించే స్థాయి లేదు..!

మంత్రి తీరుపై టీడీపీ నాయకులు ధ్వజం

విశాలాంధ్ర-పలాస : టీడీపీ అధ్యకుడు నారా చంద్రబాబునాయుడు, నారా లోకేష్, గౌతు శివాజీ, శిరీష కుటుంబంలను రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు విమర్శించడం సిగ్గుచేటని, వారిని విమర్శించే స్థాయి మంత్రికి లేదని రాష్ట్ర టీడీపీ కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్రావు అన్నారు. సోమవారం వలాస టిడిపి కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ ఎన్నికల శంఖారావం సభ విజయ వంతం కావడంతో మంత్రి ఓర్వలేక చౌకబారు విమర్శలు చేస్తున్నారన్నారు. సిఎం జగన్మోహన్రెడ్డి మెప్పుకోసమే మంత్రి తమ నాయకులను తూలనాడుతున్నారని ఒక డాక్టర్ హుందాగా ఉండాలే తప్పా యాక్టరుగా వెకిలివేషాలు వేయవద్దని సూచించారు. తమ నాయకుడు సభ ముగియకముందే పోటీ సమావేశం నిర్వహించి విమర్శలు చేయడం సరికాదని, తమ నాయకులు మంత్రికి వేసిన ప్రశ్నలు ఏమిటి. ఆయన ఇచ్చిన సమాధానం ఏమిటన్నారు. కేవలం ఐదేళ్లలో మంత్రి ఆస్తులు కూడబెట్టుకున్నారని. అంత ధనం సంపాదన వెనుక రహస్యం చెప్పాలని వారు కోరారు. కిడ్నీ పరిశోధన కేంద్రం ప్రారంభించేందుకు వచ్చిన ముఖ్యమంత్రిపై తాము విమర్శలు చేయలేదని, రాజకీయ కుటుంబాల నుంచి వచ్చిన వారిని రాష్ట్రంనకు, పలాసకు చేసింది ఏమిటని ప్రశ్నించడంలో అర్థం లేదన్నారు. అవినీతిపై సమాధానం చెప్పమంటే మంత్రి అసహనంతో వ్యంగ్య లేఖలు రాయడాన్ని ప్రజలు గుర్తించారని, ప్రజాక్షేత్రంలో వైకాపా ఓటమి ఖాయమని ఇప్పటికే ర జువైందని, తమ నాయకుడి భహిరంగ సభకు ఎన్ని ఆటంకాలు కల్పించినా అనూహ్యంగా ప్రజలు రావడమే తమ విజయానికి సూచికని స్పష్టం చేసారు.

విద్యతోనే మంచి పేరు ప్రఖ్యాతలు

మండల విద్యాశాఖాధికారులు అప్పలరాజు, ప్రతాప్‌లు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: విద్యార్థులు బాగా చదివితేనే వారికి భవిష్యత్తులో మంచి పేరు ప్రఖ్యాతలు వాటంతట అవే వస్తాయని స్థానిక మండల విద్యాశాఖాధికారులు ఎస్. అప్పలరాజు, ఎల్వి. ప్రతాప్‌లు అన్నారు. సోమవారం మండలం ఎత్తురాళ్ళపాడు గ్రామం సమీపంలోగల సరస్వతి విద్యానికేతన్ పాఠశాలలో నిర్వహించిన పాఠశాల 21వ వార్షికోత్సవం, 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ కార్యాలయంలో వీరు ముఖ్యఅతిథిలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని, భవిష్యత్తులో ఉన్నత

స్థాయికి ఎదగాలని, విద్యార్థులు బాగా చదువుకొని పాఠశాలకు, ఉపాధ్యాయులకు మంచి పేరును తీసుకురావాలని సూచించారు. విద్యార్థులు నిర్వహించిన విద్యార్థులు వేసిన సాంస్కృతిక కార్యక్రమాలను ఎంపీవోలు తిలకించి సంతోషం వ్యక్తం చేశారు. సరస్వతి విద్యానికేతన్ చీఫ్ అడ్వైజర్ గురువెళ్ళి అప్పన్న, కరస్పాండెంట్ బాప శ్రీనివాస్ భావని, పాఠశాల ప్రిన్సిపాల్ తమ్మినేని లక్ష్మణరావులు ఎంపీవోలను ఘణంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు తలగాన గణపతి, నూక సత్యరాజు, గురువెళ్ళి భారతిసూర్యప్రకాష్, శ్రీ సాయివిద్య మందిర్ పాఠశాల అదినేత బూరగాపు లక్ష్మణరావు, ఆర్, సుధాకర్, పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది ఉన్నారు. కాగా నెల 14వ తేదీనా పాఠశాలలో ఉదయం 9గంటలకు ఉచితంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందని, 3 సంవత్సరములు నిండిన మీ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించవలసింగా పాఠశాల యాజమాన్యం కోరుతున్నారు. అక్షరాభ్యాసంలో పాల్గొన్న చిన్నారులకు పలక, బలపం ఉచితంగా ఇవ్వటం జరుగుతందని వారు తెలిపారు.

పెండింగ్ అంశాలపై దృష్టి సారించాలి

-జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష

విశాలాంధ్ర -శ్రీకాకుళం: ప్రభుత్వ ప్రాధాన్యతాంశాల అమలులో ఎలాంటి అలసత్వం చూపరాదని కలెక్టర్ మనజిర్ జిలాని సామూన్ అన్నారు. జిల్లా అధికారులతో కలిసి సోమవారం మధ్యాహ్నం ఆయన సమీక్ష నిర్వహించారు. ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ, నవరత్నాలు పేదల ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్లు, అసైన్డ్ భూములు, కోర్టు కేసులు తదితర అంశాలపై తాజా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఆరోగ్యశ్రీ కార్డులు, ఆయుష్మాన్ కార్డుల పంపిణీ త్వరిత గతిన పూర్తి చేయాలని, జిల్లా వ్యాప్తంగా 1.84 లక్షల కార్డుల పంపిణీ మాత్రమే జరిగిందని, ఇంకా మిగిలిన కార్డులు పంపిణీ చేయాల్సి ఉందని ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటుచేసి త్వరితగతిన పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. నవరత్నాలు పేదలంద రికీ ఇళ్ల రిజిస్ట్రేషన్లు జిల్లాలో ఇప్పటి వరకూ 22,081 మాత్రమే జరిగాయని ఇంకా మిగిలిన వాటిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అన్నారు. సర్వర్ ఎర్రర్, మిస్‌మాచ్ లాంటి సాంకేతిక సమస్యలకు జిల్లా రిజిస్ట్రార్‌తో సమన్వయం చేసుకుని లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కుల్ని కల్పించడంలో భాగంగా 2003 జులై 31కు ముందు కేటాయించిన భూములపై సర్వేను పూర్తిచేయాలని చెప్పారు. భూముల రికార్డులను క్రమబద్దీ కరించడంలో భాగంగా తాసీల్దార్లు ఇప్పటికే ఇంటి స్థలాలు, వ్యవసాయ సాగు కోసం ప్రభుత్వం కేటాయించిన భూములను సర్వే నంబర్ల వారీగా సర్వే చేశారని, ఇంకా పూర్తిచేయని తహసీల్దార్లు దీన్ని ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలని అన్నారు. రీ సర్వే, డిజిటల్ సైన్, కోర్టు కేసులు తదితర అంశాలపై

కూడా ఈసందర్భంగా సమీక్ష చేశారు. గ్రామ సచివాలయ ఉద్యోగుల రేషనైజేషన్ డేటాను త్వరితగతిన సిద్ధం చేయా లని సూచించారు. సమావేశంలో డిఆర్వో ఎం.గణపతిరావు, జెడ్పీ సీఈఓ వెంకటేశ్వర రావు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర రావు, డిఆర్డిఏ పీడీ విద్యా సాగర్, రిజిస్ట్రార్ కిల్లి మన్మధరావు, ఐసిడిఎస్ పిడి బి.శాంతిశ్రీ, బి.ఆర్.ఆర్ వంశధార ప్రాజెక్టు ఎస్ఈ డోల తిరుమలరావు, డుమా పీడీ చిట్టిరాజు, గ్రామ సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తా

విశాలాంధ్ర-జలుమూరు: మండలం అంధవరం పంచాయతీ ఉప్పరపేట వంతెన వద్ద ఆదివారం ఓ ఇసుక ట్రాక్టరు అదుపు తప్పి బోల్తా పడింది. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. గతేడాది ఆగస్టు 14న ఇసుక లారీ వెళ్తుండగా వంతెన కూలిపోయింది. ప్రాంతంలో వాహనాల రాకపోకలు సాగించేందుకు తాత్కాలికంగా అనుబంధ రహదారి వేసినప్పటికీ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం

విశాలాంధ్ర-జలుమూరు : వెలుగు కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేసిన ఉత్పత్తులను యలమంచిలి యూనిట్ ఇన్చార్జ్ దామోదర మేరీ ఆధ్వర్యంలో సోమవారం విక్రయించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యం లభిస్తుందని చెప్పారు. కొత్తిమీర, పాలకూర, గోంగూర, మెంతికూర, తోటకూరలను విక్రయించారు. ఐసీఆర్పీలు అమరావతి, సాయమ్మ ఉన్నారు.

ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టిన జగన్

ఎఐకెఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంకల మాధవరావు

విశాలాంధ్ర-పలాస : ఆంధ్రుల ఆత్మ గౌరవ నినాదమైన విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ జరుగుతుంటే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నామ మాత్రంగా తీర్మానం చేసి మౌనం వహించారని, పార్లమెంట్లో తమ ఎంపీలతో రాష్ట్రంలో తమ ఎమ్మెల్యే లతో కేంద్రంపై పోరాటానికి ఎందుకు వెనకంజ వేస్తున్నారని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వంకల మాధవరావు ప్రశ్నించారు.సోమవారం కాశీబుగ్గ సూది కొండలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ ఈనెల 16వ తేదీన జరుగుతున్న గ్రామీణ బంద్ పారిశ్రామిక సమ్మెలో ప్రధానమైన డిమాండ్ విశాఖ ఉక్కును కాపాడుకుందాం స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల్లో భాగంగా సిప్లస్ 50 ప్రకారంగా పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం రోజుకు 600 రూపాయలు కూలీ చెల్లించాలని సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేదలకు ఇస్తున్న కూలీ దినసరి వేతనం రోజుకు 150 నుండి 200 రూపాయలు మాత్రమే పడుతుందని, రానున్న ఎండలు దృష్టిలో పెట్టుకొని ఉపాధి కూలీలకు తగిన సౌకర్యాలు కల్పించాలని త్రాగునీరు ఏర్పాటు చేయాలని కోరారు. మోదీ సర్కార్ తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక విధానాలు ఏవైతే ఉన్నాయో వాటిని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. 44 లేబర్ కోడ్ లను కుదించి నాలుగు చట్టాలుగా మార్చి వేయడం ఇది కార్మిక హక్కులను కాలరాయడమే అన్నారు. దేశంలో మతోన్మాద ఫాశిష్టకరమైనటువంటి పరిపాలన కొనసాగుతుందని దుయ్య బట్టారు. మోదీ అధికారం కోసం మణిపూర్ రాజస్థాన్ లాంటి చోట మతోన్మాదం పరాకాష్టకు చేరిందనీ, మత ఘర్షణలు. మారణ హెూమాలు సృష్టిస్తున్న మోదీని గద్దె దించే వరకు మేధావులు ప్రజాస్వామ్యవాదులు పోరాడాలని పిలుపునిచ్చారు. మేధావులపై ప్రశ్నించే వారి పైన రచయితలు కవులు కళాకారుల పైన ఎన్ఐఏ దాడులను తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి కూర్మారావు, జిల్లా ఉపాధ్యక్షులు సవర బంగ్లా కుమార్, సహాయ కార్యదర్శి వంకల. పాపయ్య ,ఐ ఎఫ్ టి యు జిల్లా కన్వీనర్ జుత్తు వీరస్వామి,పిఓడబ్ల్యు నాయకురాలు కే.సుహాసిని అరుణోదయ జిల్లా కార్యదర్శి సోమేశ్వరరావు పతివాడ షణ్ముఖరావు బాలు తదితరులు పాల్గొన్నారు.

జీడి, కొబ్బరి పంటలకు బోర్డులను ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-పలాస : ఉద్దాన ప్రాంతంలో జీడి, కొబ్బరి పంటల పై రైతులు ఆధారపడి జీవిస్తున్నారని, పలాస ప్రాంతంలో జీడి, కొబ్బరి పంటలకు బోర్డులను ఏర్పాటు చేయాలని జిల్లా రైతంగా సమస్యల సాధన కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జీడి, కొబ్బరి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీడి పిక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 80 కేజీల పిక్కల బస్తా రూ. 16,000లకు రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వంశధార ఎడమకాలువ ఇచ్ఛాపురం వరకు పొడిగించి శివారు ప్రాంతాలకు సాగునీరు అందించాలని కోరారు. తిత్లీ తుఫాను మూలంగా నష్ట పరిహారం అందని రైతాంగానికి నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేస్తున్న వారిలో దాసరి శ్రీరాములు, మామిడి మాధవరావు, గొర్లే చలపతి, మద్దిల ధర్మారావు, తామాడ రామారావు, రాజం గుణవంతు, మామిడి కమల, బొడ్డు సింహాద్రి, తామాడ గంగయ్య, బత్తిని వాసు, తామాడ అప్పారావు, కిక్కర ఢిల్లీరావు తదితర రైతులు పాల్గొన్నారు.

కంటి ఆరోగ్యానికి జాగ్రత్తలు తప్పనిసరి : ఎస్.కళ్యాణి

విశాలాంధ్ర-రణస్థలం : కంటి ఆరోగ్యానికి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని కళ్యాణి కంటి ఆసుపత్రి పారామెడికల్ అప్తాలమిక్ ఆఫీసర్ ఎస్.కళ్యాణి తెలిపారు. రణస్థలం మండల కేంద్రం బ్రహ్మణ వీధిలో ఉన్న కళ్యాణి కంటి ఆసుపత్రి ఆవరణలో సోమవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 65 మంది హాజరయ్యారు. వైద్య పరీక్షలు నిర్వహించి 17 మందిని శస్త్రచికిత్సలు కోసం ఎంపిక చేసి శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా కళ్యాణి మాట్లాడుతూ ఇంద్రియాలు అన్నింటిలో కన్ను ప్రధానమైదని. మనకి చూపును ప్రసాదించే కళ్లను సంరక్షించుకోవడం మన బాధ్యతని. కళ్ల సంరక్షణకు సంబంధించి కొన్ని విషయాలు తెలుసుకోవాలన్నారు. కంప్యూటర్ ముందు ఎక్కువసేపు పనిచేసేవారు తప్పనిసరిగా మధ్యలో కాస్త విరామం తీసుకోవాలని, అలాగే కంటి రెప్పలను ఆడిస్తుండాలని, దీని వల్ల కళ్లు పొడిబారకుండా ఉంటాయన్నారు. అలాగే కళ్లను తరచుగా చేతితో తాకడం మంచిది కాదన్నారు. కళ్లద్దాలు లేదా లెన్సులను రోజంతా పెట్టుకోవడం వల్ల కంటి చూపుతగ్గుతుందని, కళ్లు మరింత దెబ్బతింటాయని కొందరు భావిస్తుంటారని ఇది అపోహ మాత్రమే పైగా ఇవి పెట్టుకోకపోతేనే కళ్లు మరింత ఒత్తిడికి లోనవుతాయన్నారు. క్యారెట్, తాజా పండ్లు, ఆకుకూరలు, పాలు, గుడ్డులోని పచ్చసొనల్లో విటమిన్ ఎ ఉంటుందని ఇది కంటి ఆరోగ్యానికి మంచిది. అలాగే ఈ పదార్థాల్లో ఉండే విటమిన్ సి,ఈ లు అనేక కంటి సమస్యలను దూరం చేస్తాయన్నారు. కంటిచూపు మసకబారటం, కంటి నొప్పి, కళ్లముందు మిరుమిట్లు గొలిపే కాంతులు మెరవడం వంటి లక్షణాలు కనిపిస్తే దాక్టరును సంప్రదించాలని కోరారు.

లోకేష్ శంఖారావం కాదు... టిడిపి శవ యాత్ర

వైసిపి జిల్లా అధ్యక్షులు, ధర్మాన కృష్ణదాస్

విశాలాంధ్ర-నరసన్నపేట: నోరు విప్పితే అబద్ధాలు చెప్పే నారా లోకేష్ ఉత్తరాంధ్ర నుండి చేస్తున్న యాత్ర శంఖారావం కాదని, టిడిపి శవ యాత్రని వైసిపి జిల్లా అధ్యక్షులు, ధర్మాన కృష్ణదాస్ తీవ్రంగా విమర్శించారు. సోమవారం మండలంలో పలు పంచాయితీ గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాలు ప్రారంభోత్సవాల సంధర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ లోకేష్ తనకు తాను సచ్ఛీలునిగా నిప్పుగా అభివర్ణించుకుంటున్నాడని, లోకేష్ నిప్పు కాదని, ఇనుముకు పట్టే తుప్పు అని దుయ్యబట్టారు. నరసన్నపేట సభలో మాట్లాడిన లోకేష్ పగటి కలలు కంటున్నాడని, అతడికి మేనిఫెస్టో అంటే తెలుసా అని ప్రశ్నించారు. ఎన్నికలు అయిపోయిన తర్వాత మేనిఫెస్టో గురించి మర్చిపోయే మీకు, మేనిఫెస్టోను దైవంలా భావించి, 99శాతం హామీలు నెరవేర్చిన మాకు ఎంతో తేడా వుందని అన్నారు. గత మీ ప్రభుత్వ హాయాంలో వీధి వీధికి, సందు సందుకి బెల్టు షాపులు పెట్టి ప్రజల ఒళ్ళు గుల్ల చేసింది మీరు కాదా అని నిలదీశారు. నాడు-నేడుతో తీరు మారిన ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులుతో పాటు రాష్ట్రంలో ఏగ్రామానికైనా వెళ్ళి చూస్తే సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్నెస్ సెంటర్లు, డిజిటల్ లైబ్రరీల నిర్మాణాలతో టిడిపి వర్గాల కళ్ళు బైర్లు కమ్ముతాయని అన్నారు. 14సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన మీ బాబు ప్రవేశపెట్టిన పథకం ఒక్కటైనా వుందా, ఉత్తరాంధ్ర అంటే ఓటు బ్యాంకు రాజకీయాలు నడిపే

నువ్వు, నీ తండ్రి ఒక పోర్ట్ గాని, ఒక మంచినీటి పథకంగాని, కిడ్నీ రీసెర్చ్ సెంటర్ గాని, వంశధార రిజర్వాయర్ గాని, రిమ్స్ ఆసుపత్రి గాని మీహాయాంలో పూర్తి చేయగలిగారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో మోడల్ కాలనీగా నిలిచిన మా నరసన్నపేట మండలం జమ్ము గ్రామ పరిధిలో 3వేలకు పైగా జగనన్న ఇళ్ళు నిర్మాణం చూసి తట్టుకునే ధైర్యం నీకుందా అని విమర్శించారు. నరసన్నపేట నియోజకవర్గంలో రూ.150కోట్లతో నిర్మించిన రోడ్లు గురించి గర్వంగా మేము చెప్పగలమని, ఒక బిసిని డిప్యూటీ సిఎంగా చేయగలిగిన ఒక పెద్ద మనసున్న నాయకుడు జగన్మోహన్‌రెడ్డికే చెల్లిందని తెలిపారు.

నదీతీర గ్రామంలో కర్బుజా సాగు విస్తీర్ణం

విశాలాంధ్ర-జలుమూరు: మండలం వంశధార నదీతీర గ్రామాల్లో కర్బుజా సాగు జరుగుతుంది. కొన్ని సంవత్సరాలగా నదీ తీర గ్రామాల రైతులు కర్బుజా సాగు చేస్తున్నారు. ఈ ఏడాది కూడా అధిక విస్తీర్ణంలో కర్బుజా సాగు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. వేసవి కాలంలో కర్బుజా పంటకు గిరాకీ ఎక్కువగా ఉంటుంది. దీంతో రైతులు సాగుపై దృష్టి సారించారు. తీర గ్రామాలైన రామకృష్ణాపురం, అందవరం, పర్లాం, తిమడాం తదితర గ్రామాల్లో సాగు ఎక్కువగా జరుగుతుంది.

రాష్ట్రంలో రానున్నది టిడిపి-జనసేన ప్రభుత్వం

- వచ్చే ఐదేళ్ళలో 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం
- టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, నారా లోకేష్

విశాలాంధ్ర-నరసన్నపేట : రాష్ట్రంలో సుమారు 3,132కిలోమీటర్లు పాదయాత్ర చేసి, ప్రజల సమస్యలు తెలుసుకున్నానని, రానున్నది తెలుగుదేశం-జనసేన ప్రభుత్వమని, వచ్చే ఐదేళ్ళలో నిరుద్యోగ యువతకు 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, నారా లోకేష్ అన్నారు. సోమవారం స్థానిక జమ్ము జంక్షన్‌లో ఏర్పాటు చేసిన ఉత్తరాంధ్ర శంఖారావం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చేంత వరకూ నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి అందిస్తామని తెలిపారు. అలాగే 18సంవత్సరాల నుండి 59ఏళ్ళ మహిళలకు నెలకు రూ.15వేలు అందిస్తామని, ఉత్తరాంధ్రలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. సిఎం, జగన్‌రెడ్డి పని అయిపోయిందని, రాష్ట్రంలో వైసిపిని గెలిపిస్తే 25మంది ఎంపిలతో ప్రత్యేక

హెూదా తెస్తామని చెప్పి, తనపై వున్న కేసుల మాఫీ కోసం బిజేపి ప్రభుత్వానితో చేతులు కలిపారని విమర్శించారు. అంతేకాక గెలిచిన వారంలోగా సిపిఎస్ రద్దు చేస్తామని చెప్పి, జిపిఎస్ తెచ్చాడని దుయ్యబట్టారు. నియోజకవర్గంలో ఓడిపోయే ఎమ్మెల్యేలను మరో నియోజకవర్గంలో పోటీ చేసేందుకు అభ్యర్థులుగా నిల్చుండబెట్టే ఘనత జగన్‌కు దక్కుతుందని తెలిపారు. మద్యం పేరు చెప్పి ఏడాదికి రూ.9వేల కోట్లు చొప్పున్నా ఈ ఐదేళ్ళలో రూ.45వేల కోట్లు నొక్కేసిన ఘనత జగన్ రెడ్డిదని విమర్శించారు. ఇక స్థానిక ఎమ్మెల్యే, ధర్మాన కృష్ణదాస్ విషయానికొస్తే విద్యుత్ షిఫ్ట్ ఆపరేటర్ల పోస్టులు, అంగన్వాడీ పోస్టులు అమ్ముకొని, అడ్డగోలుగా ప్రజల డబ్బులు దోచుకున్నారని, ప్రభుత్వ స్థలాలు, చెరువులు కబ్జాలు చేసి, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలనే ఆకాంక్ష లేదని దుయ్యబట్టారు. స్థానిక ఎర్రంన్నాయుడు పార్క్‌ను జెసిబితో ధ్వంసం చేసి, టిడిపికి చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌ను ఏకపక్షంగా తొలగించి, నియోజకవర్గ అభివృద్ధిని మరిచారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు, కూన రవికుమార్, ఎంపి, కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్సీ, వేపాడ చిరంజీవి, మాజీ ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి, జనసేన జిల్లా పిశిని చంద్రమోహన్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త, బలగ ప్రవీణ్‌కుమార్, టిడిపి, జనసేన నాయకులు,కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

క్రమ-శిక్షణకు మారుపేరు టీడీపీ

శ్రీకాకుళం శంఖారావంలో నారా లోకేష్

విశాలాంధ్ర-శ్రీకాకుళం : క్రమశిక్షణకు పార్టీ సిద్ధాంతాలకు తెలుగుదేశం పార్టీ మారుపేరని నారా లోకేష్ అన్నారు యువగళం జైత్రయాత్రలో రాష్ట్రప్రజల గుండెల్లో స్థానం సంపాదించిన శంఖారావంలో భాగంగా ఇక్కడకు రావడం సంతోషంగా ఉందన్నారు ముందుగా జాతి పునరుజ్జీవం కోసం యువనేత లోకేష్ శంఖారావం ప్రారంభించారు. అనంతరం శ్రీకాకుళం పార్లమెంటు సభ్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ యువనేత లోకేష్ మంత్రిగా ఉన్నపుడు శ్రీకాకుళానికి తాగునీటి ప్రాజెక్టు మంజూరు చేశారు. మన హయాంలో కళింగపట్నం ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించి, 80శాతం పూర్తిచేశాం, ప్రస్తుత పాలకులు మిగిలిన 20శాతం పూర్తిచేయలేక పోయారు అని అన్నారుగత ప్రభుత్వంలో 5వేల టిడ్కో ఇళ్లు మంజూరు చేయగా, 1238 టిడ్కో ఇళ్లు పూర్తిచేశాం, వైసిపి వచ్చాక వాటిని పాడుబెట్టారు దుయ్యపట్టారు రాష్ట్ర ప్రజల కష్టాలు వింటూ 3132 కి.మీ.ల పాదయాత్ర పూర్తిచేసిన లోకేష్ రేపటి తరానికి భరోసా అని కొనియాడారు చంద్రబాబు జైలులో ఉన్నపుడు చలించిపోయిన పవన్ కళ్యాణ్ సైకోప్రభుత్వాన్ని సాగనంపాలని నిర్ణయించుకుని బేషరతుగా పొత్తు ప్రకటించారు కాబట్టి నాయకుడయ్యారు అని తెలిపారు రాష్ట్రంలో పేదప్రజలకు స్వాంతన కలిగించేందుకు చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పథకాలను ప్రకటించారు. మన ప్రభుత్వం రాగానే ఈ పథకాలన్నీ తక్షణమే అమలు చేస్తాను అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసిలను అన్నివిధాలా ఆదుకున్న ప్రభుత్వం టిడిపినే, రాష్ట్రానికి దశదిశ చంద్రబాబునాయుడే. అనే హితవు పలికారు. రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి చేసే సత్తా ఒక్క చంద్రబాబునాయుడుకే ఉంది, రాబోయే ఎన్నికల్లో టిడిపి-జనసేన ఉమ్మడి అభ్యర్థులను ప్రజలంతా గెలిపించుకోవాలి అని అన్నారు అలాగే శ్రీకాకుళం

నియోజకవర్గ ఇన్చార్జి గుండ లక్ష్మీదేవి మాట్లాడుతూ వైసిపి నేతలు ఎన్ని అవమానాల పాల్జేసినా ప్రజలకోసం పోరాడుతున్న చంద్రబాబుగారికి కృతజ్ఞతలు. తెలిపారు అన్న ఎన్టీఆర్ సారధ్యంలో 4సార్లు ఎమ్మెల్యేగా, 2సార్లు మంత్రిగా నా భర్త పనిచేశారు. సిక్కులు ప్రజలకు మరో మారు గుర్తు చేసారు, కార్యక్రమంలో మాజీ మంత్రి గుండ అప్పలసూరి నారాయణ శ్రీకాకుళం జిల్లా ఉమ్మడి సర్పంచుల సంఘం అధ్యక్షులు గోందు శంకర్ కొర్ను ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇంటర్న్ షిప్ అవకాశం కల్పించాలి

కలెక్టర్ డా. మనజీర్ జిలాని సమూన్

విశాలాంధ్ర-శ్రీకాకుళం : డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్ షిప్ చేసుకునేందుకు తక్షణమే అవకాశం కల్పించాలని జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సమూన్ సంబంధిత శాఖాధిపతులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్ షిప్ కు కేటాయింపు పై బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ బి. అడ్డయ్యతో కలిసి కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2021-22 డిగ్రీ విద్యార్థుల ఇంటర్న్ షిప్ కొరకు ప్రభుత్వ శాఖాధిపతులకు కేటాయించిన విధంగా విద్యార్థులను తీసుకోవాలని ఆదేశించారు. 15వారాలు లాంగ్ టెర్మ్ ఇంటర్న్ షిప్ కొరకు శాఖాధిపతులకు కేటాయించడం జరిగిందన్నారు. ప్రస్తుతం 5,445 మంది విద్యార్థులను 27 శాఖలకు కేటాయించినట్లు చెప్పారు. ఇందులో 2,000 మంది సచివాలయాలకు, 1,770 మందికి విద్యాశాఖలో, 452 మందికి వైద్య, ఆరోగ్య శాఖకు అత్యధికంగా కేటాయించినట్లు చెప్పారు. మిగిలిన శాఖలకు తక్కువగా ఉన్నారని, వీరందరికి గతంలో మాదిరిగానే ప్రొసీడింగ్స్ ఇచ్చి, ఆయా అధికారులకి సమాచారాన్ని అందజేయాలన్నారు. విద్యార్థులు వెళ్లాల్సిన అధికారి పేరు, ఫోన్ నెంబర్లను విద్యార్థులకు అందజేయాలని అన్నారు.

ఈ సమావేశంలో ఎస్పి జి ఆర్ రాధికా, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, జిల్లా అటవీ శాఖ అధికారి నిషా కుమారి, జిల్లాపరిషత్ సిఈఓ వెంకటేశ్వర రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి. మీనాక్షి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, డిఆర్డిఏ పిడి విద్యా సాగర్, సీటీఓ రాణి మోహన్, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

- దాడులకు తెగబడడం సరికాదు
- జరుగుల్ల శంకరరావు కుటుంబానికి న్యాయం చేయాలి
- వైసిపి సీనియర్ నాయకులు లుకలాపు అప్పలనాయుడు
- పోలీస్ స్పందనలో ఎస్పీకి వినతిపత్రం అందజేత

విశాలాంధ్ర-అరసవల్లి: వైసిపి సీనియర్ నేత, వైస్ ఎంపీపీ జరుగుల్ల శంకర్రావు పై దాడి అమానుషమని, తక్షణమే దోషులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని వైసీపీ సీనియర్ నేత లుకలాపు అప్పలనాయుడు డిమాండ్ చేశారు. ఇటీవల ఎచ్చెర్ల మండలంలో జరుగుళ్ల శంకర్రావు పై గుర్తు తెలియని దుండగుల దాడిని నిరసిస్తూ సోమవారం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ఏడు రోడ్ల కూడలి నుండి ఎస్పీ కార్యాలయం వరకు లుకలాపు అప్పలనాయుడు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ముందుగా అప్పలనాయుడు మీడియాతో మాట్లాడుతూ ప్రశాంతమైన శ్రీకాకుళం జిల్లాలో ఇటువంటి ఘటనలు దురదృష్టకరమని అన్నారు. మృదుస్వభావి, స్నేహశీలి, అజాతశత్రువు అయిన శంకరరావుపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. ఇటువంటి ఘటనలతో రాజకీయాల్లో ఉండేవారు భయాందోళన లో గురవుతారని, పోలీసులు దోషులను గుర్తించి చర్యలు తీసుకొని శంకర్రావు కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. శంకరరావు సతీమణి విజయ కుమారి ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, ఎంపీపీ మొదలవలస చిరంజీవిల సహకారంతోనే ఈ దాడి జరిగి ఉంటుందని ఆరోపించారు. కొంత కాలంగా తన భర్త శంకరరావు ఎమ్మెల్యే కిరణ్ కుమార్ అరాచకాలపై పోరాడుతున్నారన్నారు. దానిని మనసులో పెట్టుకొని కక్షతోనే ఇటువంటి దాడులకు పాల్పడుతుండడం విచారకరమని అన్నారు. ఇప్పటికే మంత్రి ధర్మాన ప్రసాదరావు, వైసిపి ప్రతినిధులు తన భర్తను పరామర్శించారని చెప్పారు. ఎం జగన్ మోహన్ రెడ్డి తక్షణమే స్పందించి తన భర్తకు, కుటుంబానికి న్యాయం చేయాలని వేడుకున్నారు. తమ కుటుంబానికి అండగా నిలిచిన వెలమ సామాజిక వర్గ ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని చెప్పారు. వేలాదిగా వెలమ సామాజిక వర్గ ప్రతినిధులు, ప్రజలు తన వెంట కదలిరాగా లుకలాపు అప్పలనాయుడు, జరుగుల్ల విజయ కుమారి ఎస్పీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలి, శంకర్రావుకు న్యాయం చేయాలి అని నినాదాలు చేశారు. అనంత రం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహిస్తున్న పోలీస్ స్పందనకు వెళ్లి ఎస్పీ జీ ఆర్ రాధికను కలిసి వినతి పత్రం అందజేశారు. ఎస్పీకి దాడి జరిగిన ఘటనను, పరిణామాలను వివరించారు. ఈ ర్యాలీలో బల్లాడ జనార్దనరావు, నక్క రామరాజు, బగ్గు అశిరి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతగా పనిచేసి విజయాలు సాధిద్దాం

విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విశాలాంధ్ర-సోంపేట : అత్యంత ప్రతిష్టాత్మకమైన త్వరలో జరగబోయే సాధారణ ఎన్నికలకు వైసీపీ కుటుంబ సభ్యులందరూ ఐక్యంగా పని చేసి ప్రతి నియోజకవర్గం నుంచి విజయాలు సాధించి జగనన్నకు బహుమతిగా ఇద్దామని విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గ కేడర్‌తో ఈ మండలం బారువలో సోమవారం జరిగిన ఎన్నికల అవగాహన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సుదీర్ఘ పాదయాత్ర ద్వారా ప్రజాసమస్యలు పూర్తిగా తెలుసుకుని భారీ మెజార్టీతో అధికారంలోకి వచ్చి విప్లవాత్మకమైన సంక్షేమ పథకాలకు బీజం వేసి అభివృద్ధిని పరుగులు పెట్టించిన వైఎస్ జగన్ దేశంలోనే ఒక ప్రత్యేకత సాధించారని అన్నారు. ఒక్కడుగా అనేక విజయాలు సాధిస్తున్న జగన్‌ను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఇరకాటంలో పెట్టాలన్న దుష్టచతుష్టయం ఎన్నో పన్నాగాలు పన్నుతున్నప్పటికీ ధైర్యంగా ఎదుర్కొంటు మనమంతా బాసటగా నిలవాల్సిన అవసరం ఉందని అన్నారు. జగన్ పిలుపునిచ్చిన వైనాట్ 175 సాధనకు ప్రతి ఒక్కరు కట్టుబడి మనస్ఫూర్తిగా పనిచేస్తే విజయాలు సాధించడం తథ్యమని అన్నారు. భేషజాలలకు పోకుండా అసంతృప్తులను పక్కన పెట్టి అత్యంత క్లిష్టమైన ఈ దశలో ప్రతి ఒక్కరు అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యేలు సాయిరాజ్, నరేష్‌కుమార్ అగర్వాలా, పేరాడ తిలక్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, స్థానిక ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు, ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, ఉలాల భారతిదివ్య, తదితరులు పాల్గొన్నారు.

లోకేష్‌ను కలసిన సూర్యారావు

- ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్- 22ను రద్దు చేయాలని వినతి

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: సామాన్యులకు నష్టం చేకూర్చే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్- 22ను రద్దు చేయాలని కోరుతూ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు, న్యాయశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఎన్ని సూర్యారావు జిల్లాకు విచ్చేసిన తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. సోమవారం 80 అడుగుల రోడ్డులోని శంఖారావం సభకు విచ్చేసిన నారా లోకేష్‌ను టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి కొత్తకోట అమ్మినాయుడు, లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి అన్నెపు భువనేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు గోర అనిల్‌కుమార్‌ల ఆధ్వర్యంలో కలిశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు లోకేష్‌ను కలసి ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్- 22 వల్ల కలిగే నష్టాన్ని వివరించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ ప్రతిపక్షాలతో చర్చించకుండా, ప్రజాభిప్రాయం సేకరించకుండా తెచ్చిన ఈ చట్టాన్ని తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేస్తామని నారా లోకేష్ హామీనిచ్చారు. లోకేష్ ను కలసిన వారిలో బార్ అసోసియేషన్ కార్యదర్శి పొన్నాడ రాము, భవానీ ప్రసాద్, యగళ్ల ప్రసన్నకుమార్, ధర్మాన నీలంనాయుడు, కింజరాపు శ్రీనివాసరావు, కె.అశ్వినీకుమారి, పేరూరి నాగేశ్వరరావు, టి ఖగేంద్రనాథ్, ఎన్ని రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యల పరిష్కారానికే సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-ఎల్ఎన్‌పేట : ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ప్రతి మూడు నెలలకొకసారి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ గిరిబాల అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి రెడ్డి జ్యోతి లక్ష్మి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక్కొక్క శాఖపై అధికారులు వివరిస్తుండగా మండల ప్రత్యేక ఆహ్వానితులు రెడ్డి రామారావు మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యాపై ప్రతీ గ్రామంలో త్రాగు నీటికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. అలాగే గిరిజన గ్రామాల్లో రోడ్లు,విద్యుత్ సదుపాయం లేదని, కొన్ని గిరిజన గ్రామాల్లో విద్యుత్ వైర్లు మరమ్మత్తులకు గురైన సకాలంగా విద్యుత్ అధికారులు స్పందించడం లేదని జడ్పీటీసి కిలారి త్రినాధులు సభ దృష్టికి తెచ్చారు. దబ్బపాడు గ్రామంలో నిర్మించిన జగనన్న కాలనీకు విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేయాలని, దబ్బపాడు మీదుగా ఉన్న అగ్రహారం వంతెన పూర్తిగా మరమ్మత్తులకు గురైందని సంబంధిత అధికారులకు ఎన్ని పర్యాయాలు విన్నవించినా సమస్య పరిష్కారం కావడంలేదని సర్పంచ్ ప్రతినిధి ముద్దాడ లక్ష్మణరావు సభలో తెలిపారు. ఈకార్యక్రమంలో తహశీల్దార్ రాణిఅమ్మాజీ, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు పంచాయితీరాజ్ జెఈ భాస్కరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జెఈఏ సాగర్, ఈవోపిఆర్‌డి పద్మజ, పశువైద్యాధికారి కవిత, ఏపిఎం రవిరాజు, ఎపీఓ శ్రీదేవి, వ్యవసాయాధికారి లతశ్రీ తదితురులు పాల్గొన్నారు.

జిల్లా శ్రీశయన సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : జిల్లా శ్రీశయన సంఘం నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం స్థానిక శ్రీశయన భవన్, బలగలో జరిగింది. ఈ కార్యక్రమానికి లోడ అప్పారావు, శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులతో రాష్ట్ర అధ్యక్షులు లోడ అప్పారావు ప్రమాణస్వీకారం చేయించారు. రాష్ట్ర శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ డి పి దేవ్ మాట్లాడుతూ గత 50 సం.ల క్రితం సర్దార్ గౌతు లచ్చన్న సూచనలతో వంగా చిట్టెమ్మ, దండి సూర్యనారాయణ దేవ్ గార్లు అధ్యక్ష, కార్యదర్శి లుగా సంఘం స్థాపించారని నాటి నుండి నేటి వరకు జాతి అభివృద్ధి కొరకు అనేక కార్యక్రమాలు చేస్తూ ముందుకు వెళ్తున్నందుకు అభినందిస్తూ నూతన కార్యవర్గంపై గురుతర బాధ్యతలు ఉన్నాయని జాతి ప్రతిష్ఠ ఇనుమడించేలా కార్యక్రమాలు చేసి సంఘానికి మంచి గుర్తింపు తేవడానికి కృషి చేయాలని కోరారు. ఇంకా వంగా మహేష్ దేవ్, గుజ్జల శాంతమూర్తి, ఇర్రి ఆదినారాయణ, కర్రి రంగాజి దేవ్, జాక శ్యామ్, పోలాకి చిన్నారావు, ముంగి సాంబమూర్తి, బానాల క్రిష్ణారావు, బోగాది అప్పలనాయుడు, సిందిరి బాబూరావు, శ్రీనివాసరావు టీచర్, ఇర్రి అచ్చెన్న, డొంకాన అశిరినాయడు, దండాశి జ్యోతి భాస్కర్, కోల శ్రీలక్ష్మి, గొండు నీలాద్రి, పుట్ట ఆదిలక్ష్మి తదితర పాల్గొన్నారు.

కారా కథా నిలయంపై పరిశోధనపత్రం సమర్పించిన ఉమాకవి

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ అక్షరతపస్వీ డా.కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ సమన్వయకర్త కొల్లి రమావతి సమక్షంలో శ్రీశ్రీ కళావేదిక జాతీయ ఆర్గనైజింగ్ కార్యదర్శి డా.టి.పార్థసారధి పర్యవేక్షణలో అంగరంగ వైభవంగా 129వ కవిసమ్మేళనం మన కొయ్యలగూడెంలో అంతర్జాతీయ ఐ.ఎస్.ఓ గుర్తింపు పొందిన ఏకైక సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ '129' వ జాతీయ శతాధిక కవిసమ్మేళనం, జాతీయ సాహితీ సదస్సునకు సుమారు 30 మంది కవులు, డిగ్రీ కళాశాల విద్యార్థులు శ్రీ శ్రీ కవిత్వం. విప్లవ అభ్యుదయ దృక్పథం,, డాక్టర్ బోయి భీమన్న "పాలేరు నుండి పద్మభూషణం వరకు, గుర్రం జాషువా సాహిత్యం, సామాజిక దృక్పథం, ఆధునిక తెలుగు సాహిత్యం.. విభిన్న ప్రక్రియలు అంశాలుగా తీసుకొని పరిశోధనా పత్రాలను సమర్పించారు. తెలుగు సాహిత్యం.. విభిన్న ప్రక్రియలో భాగంగా శ్రీకాకుళం సాహితీ చైతన్య కిరాణాలు, బాలకథానిలయం అధ్యక్షులు డా. బోగెల. ఉమామహేశ్వరరావు (ఉమాకవి) ఆధ్వర్యంలో శ్రీకాకుళం కథానిలయం వ్యవస్థపక అధ్యక్షులు కాళీపట్నం రామారావు తెలుగు సాహిత్యం లో చేసిన కృషి పై పరిశోధనా పత్రం తయారు చేసి సమర్పించారు. కారా - కథానిలయం సాహితీ చరిత్ర పై పరిశోధన పత్రం సమర్పణం పై పలువురు అభినందించారు. ఈ సమావేశంలో ఆది కవి నన్నయ్య విశ్వవిద్యాలయం సహాయ ఆచార్యులు డా. తరపట్ల సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం సహాయ ఆచార్యులు డా. బత్తల అశోక్ కుమార్ ఈ పరిశోధన పత్రాల సమర్పణలో న్యాయ నిర్ణేతలు గా వ్యవహరించారు. శ్రీనాథ మహాకవి వంశీయులు డా. కావూరి శ్రీనివాస శర్మ, ప్రకాశం కళాశాల చైర్మన్ జనార్ధన రావు, ప్రిన్సిపాల్ సిహెచ్. హనుమాన్ చౌదరి, శ్రీ శ్రీ కళావేదిక జాతీయ అధ్యక్షురాలు జి. ఈశ్వరి భూషణం, చిట్టి లలిత, ఫిజిక్స్ అరుణ్ కుమార్, రాకేష్, విజయ్ కుమార్, శ్రీహరికోటి, పి శ్రీనివాస్ బాబు, గరిమెళ్ళ రాజేంద్రప్రసాద్ , కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

జె.సి.ఐ అధ్యక్షునిగా 'షణ్ముఖ్'

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : జే.సి.ఐ స్థానిక శాఖ 7వ వార్షికోత్సవాన్ని ఆదివారం పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బెల్లుపడా వద్ద జాతీయ రహదారిపై స్వాగత పలకాన్ని జోన్ ప్రెసిడెంట్ గొంప సురేష్ సమక్షంలో ఏర్పాటు చేసారు. సాయంత్రం నిర్వహించిన వార్షికోత్సవ సభలో నూతన అధ్యక్షునిగా టి. షణ్ముఖ్‌ను ఎంపిక చేసుకున్నారు. పూర్వ అధ్యక్షుడు స్వరూప్ అధ్యక్షతన నిర్వహించిన సభలో వక్తలు మాట్లాడుతు జె.సి.ఐ ప్రతినిధులు సామాజిక బాధ్యతతో చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. పూర్వపు జాతీయ ఉపాధ్యక్షురాలు పి. రజిత మాట్లాడుతు సామాజిక అంశాల ప్రాతిపదికన జే.సి.ఐ సేవలు అందివ్వడం జరుగుతుందని, కొత్త కార్యవర్గం పట్టణంలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కొత్త కార్యవర్గంలో కార్యదర్శిగా సి.హెచ్.పవన్, కోశాధికారిగా వి. ప్రేమ్‌సాయిలు బాధ్యతలు స్వీకరించారు. నూతన అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన షణ్ముఖ్ మాట్లడుతు భవిష్యత్ కార్యాచరణతో మెరుగైన ఫలితాలు సాధిస్తామని అన్నారు. జోన్ వైస్ ప్రెసిడెంట్ సాయి సుధీర్, జోన్ కోఆర్డినేటర్ అనుదీప్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కె. శ్రీనివాస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అప్రెంటిస్ మేళాలో 47 మంది ఎంపిక

విశాలాంధ్ర-ఎచ్చర్ల : ప్రభుత్వ ఐటిఐ లో సోమవారం నిర్వహించిన ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్ మేళాలో 47 మంది ఎంపికయ్యారు. జిల్లావ్యాప్తంగా 82 మంది ఐటిఐ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ మేళాలో పాల్గొనగా 47 మందిని ఎంపిక చేశారు. ఎన్ఎసిఎల్, శ్యామ్ ఫిస్టన్స్, స్మార్ట్ కం, నాగావలి సాల్వెంట్ ఆయిల్, అరబిందో, సాయి సౌమ్య కమ్యూనికేషన్స్ తదితర కంపెనీలో అప్రెంటిస్ కోసం వీరిని ఎంపిక చేశారు ఈ సందర్భంగా ఐటిఐ అడ్మిషన్ల కన్వీనర్ ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ ఎల్ సుధాకర్ రావు మాట్లాడుతూ ఐటిఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు తప్పనిసరిగా అప్రెంటిస్ చేయాలన్నారు ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఆఫీసర్లు విద్యాసాగర్ రావు కామేశ్వరరావు కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : స్థానిక పట్టణ ఎస్సై వి.సత్యన్నారాయణ సిబ్బందితో కలిసి సోమవారం వాహనాల తనిఖీలను నిర్వహించారు. పట్టణంలో మార్కెట్ కూడలి వద్ద పలు ద్విచక్ర వాహనాలు నిలిపి దస్త్రాలు పరిశీలించి, లేని వారికి హెచ్చరించారు. రోడ్డు పై వాహనాలు నడిపేటప్పుడు ఖచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, 18లోపు వారికి వాహనాలు ఇచ్చే తల్లిదండ్రుల, కుటుంభ సభ్యులపై కేసులు నమోదు అవకాశాలు ఉన్నాయని, అతి వేగంగా వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడవద్దని ఎస్సై ఈ సందర్భంగా అన్నారు.

ఎచ్చెర్లలో బంద్

విశాలాంధ్ర-ఎచ్చర్ల : మండల వైసీపీ నేత ఎచ్చెర్ల మాజీ సర్పంచ్ జరుగుల్ల శంకరరావు పై జరిగిన హత్యాయత్నానికి నిరసనగా సోమవారం ఎచ్చెర్ల లో బంద్ పాటించారు. ఎచ్చెర్ల లోని షాపులు, మీసేవ కేంద్రాలు, బ్యాంకులు విద్యాసంస్థలు కూడా బందులో పాల్గొన్నాయి బంద్ కారణంగా ఎచ్చర్ల వీధులు నిర్మానుష్యమయ్యాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా హత్యాయత్నానికి నిరసనగా శ్రీకాకుళం నగరంలో నిర్వహించిన ర్యాలీకి రాజకీయ పార్టీలకు అతీతంగా ఎచ్చెర్ల నుంచి పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

వలసల నివారణకు ప్రత్యేక ప్రణాళిక

- ఆముదాలవలసకు ముగ్గురు ఎం.ఎల్ఏలు
- రిటర్న్ గిఫ్ట్ అందిస్తాం
- శంఖారావం సభలో వెల్లడి

విశాలాంధ్ర-ఆముదాలవలస... వలసలు నివారణకు ప్రత్యేక ప్రణాళికల రూపొందించి పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. ఆముదాలవలస శంఖారావం సభలో మాట్లాడుతూ ఏ రాష్ట్రం ఏ ప్రాంతంలో చూసిన సిక్కోలు వాసులే వలస కూలీలుగా వెళుతున్నారని అధికా రంలోకి వచ్చిన తర్వాత వలసలు నివారిం చేందుకు పరిశ్రమలు ఏర్పాటుచేసి అందరికీ ఉపాధి కల్పిస్తామని స్పష్టం చేశారు. రెడ్ బుక్ లో అవినీతి అక్రమాలు చేసిన వారి పేర్లు నమోదు చేశామని అధికారం చేపట్టిన తర్వాత చట్ట పరంగా చర్యలు చేపడతామని అన్నారు. వైసీపీ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని దుయ్యబట్టారు. జనసేన టిడిపి ఆధ్వర్యంలో సూపర్ సిక్స్ కార్యక్రమం ద్వారా రాష్ట్ర సంక్షేమానికి అభివృద్ధికి కృషి చేస్తామని వివరించారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశం లో కూన రవికుమార్ మాట్లాడుతూ తెలుగు దేశం కార్యకర్తల పైన అక్రమ కేసులు బనా యించిన వారికి రిటర్న్ గిఫ్ట్ త్వరలో అంది స్తామని కార్యకర్తల కేరింతల నడుమ స్పష్టం చేశారు. వైసిపి అధికారం చేపట్టిన తర్వాత దోచుకున్న అన్నింటిని తిరిగి ప్రజలకు అంది స్తామన్నారు. స్థానిక ఎమ్మెల్యే తమ్మినేని సీతారామ ఉద్దేశించి అవినీతి అక్రమాలకు అడ్డాగా నిలిచారని విమర్శించారు. ప్రశ్నించి న వారిపై తప్పుడు కేసులు బనాయించి వేధించారని అటువంటివారిని విడిచి పెట్టేది లేదని తెలిపారు. కింజరాపు రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ ఆముదాలవలస కు ముగ్గురు ఎమ్మెల్యేలు ఉన్నారని, మూడు హుండీలు పెట్టి ప్రజలను దోచుకుంటున్నారని విమర్శించారు. రైల్వే స్టేషన్ అభివృద్ధికి ఎంతో కృషి చేశానని, రానున్న రోజుల్లో అత్యంత సుందరంగా తయారుచేసి దేశం లోనే ప్రథమ పదములో నిలుపుతానని స్పష్టం చేశారు. తప్పు చేసిన వారి వెన్నులో వణుకు పుట్టే విధంగా రెడ్ బుక్ ఉందని అన్నారు. ఆముదాల వలసిన అధోగతి పాలు చేసిన వైసిపి వారిని తరిమి కొట్టాలని పిలు పునిచ్చారు. సిద్ధం సభలో జగన్మోహన్ రెడ్డి తను ఓడిపోవడానికి సిద్ధమంటూ వారి కార్యకర్తలు నడుమ ప్రకటించటం వారిలో ఆందోళన కలిగించే విధంగా ఉందని అన్నా రు. ధనార్జన ఇసుక దోపిడీ అవినీతి అక్రమా లే ప్రధాన అజెండాగా స్థానిక ఎమ్మెల్యే వ్యవ హరించి ఇసుక బకాసురుడుగా మారారని ఎద్దేవా చేశారు. జనసేన ప్రతినిధి పేడాడ రామ్మోహన్ రావు మాట్లాడుతూ వైసిపి నాయకులు ప్రశ్నించే వారిపై తప్పుడు కేసు లు బనాయించి వేధించారని ఇటువంటి వాటిని ఎదుర్కొని రానున్న ఎన్నికల్లో సైని కుల వలే పోరాడాలని పిలుపునిచ్చారు. రెండు నెలల్లో వైసిపి అక్రమాలను గ్రామ స్థాయిలో వివరించాలని కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివా ళులర్పించారు. అనంతరం సూపర్ సిక్స్ కిట్లను కార్యకర్తలకు అందించారు. కార్య కర్తలను అభిమానిస్తామని నాయకులను ప్రోత్సహిస్తామని పనిచేసే వారిని గుండెల్లో పెట్టి చూసుకుంటామని లోకేష్ స్పష్టం చేశారు. రెండు నెలలు కష్టపడి పనిచేస్తే అధికారం మనదేనని నిరంతరం కార్య కర్తలకు అండగా ఉండే పార్టీ తెలుగుదేశం పార్టీ అని తెలిపారు. నాలుగు మండలాల కార్యకర్తలు అభిమానులు కార్యక్రమంలో పాల్గొన్నారు.